క్లుప్తంగా

మౌలిక వసతులను మేనిఫెస్టోలో పొందుపర్చాలి



ఆర్మూర్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలు ప్రజా మౌలిక వసతులను మేనిఫెస్టో పొందుపర్చాలని న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికలు, ప్రజా సమస్యలు అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మిగులు భూములు పేదలకు పెంచాలని, ఉద్యోగ భర్తీలు చేసి ఉపాధి భద్రత కాపాడాలని, విద్య వైద్యరంగ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. నాయకులు సూర్య శివాజీ, ఖాజా మైనోద్దీన్, సురేష్ బాబు, ప్రిన్స్, వెంకటేష్ పాల్గొన్నారు.

బీఎల్ఎఫ్‌తోనే బహుజనులకు న్యాయం



బోధన్/బోధన్‌టౌన్: బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌తో బహుజనులకు న్యాయం జరుగుతుందని బీఎల్ఎఫ్ బోధన్ అభ్యర్థి ఎండీ మోసిన్ అన్నారు. పట్టణంలో సోమవారం ఆయన ఎంసీపీఐ(యూ), బీఎల్ఎఫ్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఐక్యతతో పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. బహుజనుల రాజ్యాధికారమే బీఎల్ఎఫ్ లక్ష్యమన్నారు. నాయకులు తోట సంగీత, గంగాధర్, మహిళలు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



బోధన్: పట్టణంలో సోమవారం రాష్ట్రస్థాయి న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమ కరపత్రాలను స్థానిక న్యాయవాదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు మద్దతుగా నవంబర్ 4న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు వీఆర్‌దేశాయ్, శ్యాంరావు, అబిద్ అహ్మద్, శంకర్, సూర్య ప్రకాష్, మాధవీలత, శంకర్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో సోమవారం న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాలను బీఆర్ఎస్ న్యాయవాదులు ఆవిష్కరించారు. ఎంకే నరేందర్, రమేష్, ఖాందేష్ సంగీత, గణేష్, జీజీరాం, ఎంకే నాగరాజులు పాల్గొన్నారు.

పార్టీని వీడడం సరికాదు



నవీపేట: బోధన్ మున్సిపల్ మాజీ చైర్మన్ యానంపల్లి ఎల్లం బీఆర్ఎస్‌ను వీడడం సరికాదని ఎంపీపీ సంగెం శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే షకీల్ ఎల్లంకు మున్సిపల్ చైర్మన్ పదవిని కట్టబెట్టారని పేర్కొన్నారు. అయినా పార్టీ మారడం సరికాదన్నారు. నాయకులు తెడ్డుపోశెట్టి, బుచ్చన్న, బత్తూరు సాయిలు, గౌరురాజు, జనార్దన్, స్వామి, రమేష్, పోసాని తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని 13, 14 వార్డుల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్ రెడ్డి, కొలిపాక బాలరాజు, వాసు, అర్వింద్, సందీప్, సాయినాథ్, కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ కుటుంబ సమేతంగా లింగానికి అభిషేకం చేశారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహించారు.

ఎన్నికల విధులపై శిక్షణ ప్రారంభం

- బోధన్‌లో రెండు రోజులపాటు కొనసాగనున్న శిబిరం



బోధన్‌లో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న నియోజకవర్గంలోని ఉద్యోగులు

బోధన్: నియోజకవర్గ పరిధిలోని వివిధ శాఖల ఉద్యోగులకు సోమవారం పట్టణంలోని ఇందూర్ బీఈడీ కళాశాలలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ఇక్కడ శిక్షణ పొందిన ఉద్యోగులు పీవోలు, ఏపీవోలుగా ఇతర నియోజక వర్గంలోని ఎక్కడైనా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఈసందర్భంగా ఎడపల్లి ఎంపీడీవో, జిల్లాస్థాయి ఎన్నికల శిక్షణ మాస్టర్ ట్రెయినర్ గోపాల కృష్ణతో మరో 12 మంది మాస్టర్ ట్రెయినర్స్ పీవోలు, ఏపీవోలకు సంబంధించిన బాధ్యతలను ఉద్యోగులకు వివరించారు. గోపాల్ కృష్ణ మాట్లాడుతూ.. ఈవీఎంల డిస్ట్రిబ్యూటర్ కేంద్రం నుంచి ఈవీఎంలు, ఇతర సామాగ్రి స్వీకరణ, పోలింగ్ నిర్వహణ అనంతరం తిరిగి అప్పగించే వరకు నిర్వర్తించే బాధ్యతలను శిక్షణ ఇచ్చామని తెలిపారు. తొలి రోజు 300 మందికి శిక్షణ ఇవ్వగా, రెండో విడతలో బోధన్ నియోజకవర్గంలో విధులు నిర్వర్తించే పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఉంటుందని వెల్లడించారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా..



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

భీమ్‌గల్: బాల్కొండలో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇస్తే, ఎన్నడూ చూడని విధంగా అభివృద్ధి చేసి చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే, బాల్కొండ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ హామీ ఇచ్చారు. మండలంలోని దేవన్‌పల్లి, కారేపల్లి గ్రామాల్లో సోమవారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేసిన అవినీతి అక్రమాల గురించి ప్రశ్నిస్తే మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఎందుకంత భయం అని ప్రశ్నించారు. గ్రామాల్లో జరిగే ప్రతీ అభివృద్ధి పనికి కేంద్రం నిధులు పంపిస్తుందన్నారు. నాయకులు నిమ్మల శ్రీనివాస్, మల్కాన్నగారి మోహన్, మహిపాల్, వెంకటేష్ నాయక్, రమేష్, ప్రకాష్, ప్రేమ్, లింబ్యా నాయక్ పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం



డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రజారంజక పాలన కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని కాంగ్రెస్ ఆర్మూర్ అభ్యర్థి వినయ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మారంపల్లి, గంగాసరం, చిన్నయానం, గాదేపల్లి, నడ్కుడ, అన్నారం, సిర్పూర్ గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ జెండా, ఎజెండా గురించి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామన్నారు. నాయకులు మహిపాల్, గౌడిశరం భూమేశ్ రెడ్డి, గంగారెడ్డి, పెంట ఇంద్రుడు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కమ్మర్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీవో సింహాచలం



సాలూరలో..

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార శాఖ అధికారి సింహాచలం సోమవారం ప్రారంభించారు. కోనసముందర్, కోనాపూర్, చౌట్‌పల్లిలో సీఈవోలు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. చైర్మన్ రేగుంట దేవేందర్, మాజీ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, ఏవో లావణ్య, సీఈఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని బినోల సొసైటీ పరిధిలోని నాళేశ్వర్, నిజాంపూర్, లింగాపూర్, జన్నెపల్లి, మోకన్‌పల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గిర్దావర్ మోహన్, సీఈవో రమేష్ ప్రారంభించారు.

రెంజల్(బోధన్): రెంజల్ విండో పరిధిలోని రెంజల్, బోర్గాం, తాడ్‌బిలోలి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను విండో సీఈవో రాముగౌడ్, ఏఈవోలు ప్రసాద్, అజయ్ ప్రారంభించారు.

బోధన్: సాలూరలోని వ్యవసాయ సహకార సంఘంలో సోయా, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బోధన్ ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్, సొసైటీ సీఈవో బస్వంత్‌రావు ప్రారంభించారు. ఏఈవో అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

అవినీతి నేతలకు ఓటుతో బుద్ధి చెప్పాలి



ఫకీరాబాద్‌లో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నవీపేట/రెంజల్: అవినీతి నాయకులను ఓటుతో సాగనంపాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి సూచించారు. నవీపేట, రెంజల్ మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణలో పదేళ్లు అధికారాన్ని చేపట్టిన బీఆర్ఎస్‌పై ప్రజలు నమ్మకం కోల్పోయారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలకు గ్రామాలలో విశేష స్పందన లభిస్తుందన్నారు. తాడ్‌బిలోలి విండో మాజీ చైర్మన్ హన్మంత్‌రావ్‌తోపాటు మరో 30 మంది బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన మహిళలు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు సుధాకర్‌రావ్, శ్రీనివాస్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, గోపాల్, సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట గ్రామంలో బీఆర్ఎస్ నుంచి తాళ్ల విజయకుమార్ గౌడ్ అతని అనుచరులు సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు . సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. జానకంపేటలో రోడ్డు విస్తరణలో ఇళ్లను కోల్పోయిన బాధితులకు స్థలాలు ఇప్పిస్తామని ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ హామీ ఇచ్చి, విస్మరించారన్నారు. పులి శ్రీనివాస్, వరదగౌడ్, కిషోర్, జహీర్ అహ్మద్, చిన్నయ్య, బాల్‌లింగం, సత్యనారాయణ, కిషన్‌గౌడ్ ఉన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలనను అంతం చేద్దాం



బాల్కొండ: రాష్ట్రంలో అవినీతి పాలనను అంతం చేద్దామని కాంగ్రెస్ బాల్కొండ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని వెంచిర్యాల్, రెంజర్ల, నాగంపేట్ గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ కాలువ లీకేజీ నీళ్లు అడిగితే రైతులపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి అక్రమంగా కేసులు పెట్టిండన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ హామీలను అమలుపరుస్తామన్నారు. అనంతరం పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. క్యాతం గంగారెడ్డి, వేణుగోపాల్ యాదవ్, ముత్యం రెడ్డి, చిన్నారెడ్డి, మధు, శేషాద్రి, మల్లారెడ్డి, ఆకుల రమేశ్, డీసీ గంగయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాలు దేశానికి ఆదర్శం



బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పట్టణంలోని రాకాసీపేట్‌లో సోమవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఎమ్మెల్యే షకీల్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు అబ్బగోని గంగాధర్ గౌడ్, మండవ శ్రీనివాస్, ప్రసాద్, బాలకృష్ణ, కార్యర్తలు ఉన్నారు.

రాష్ట్రానికి కేసీఆర్ పాలన శ్రీరామ రక్ష



సాలూరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి

బోధన్: సీఎం కేసీఆర్ పాలన, నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ అన్నారు. సాలూరలో సోమవారం ఆయన బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు యత్నిస్తున్నాయన్నారు. అనంతరం కాంగ్రెస్, బీజేపీల నాయకులు, యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు బుద్దె రాజేశ్వర్, గిర్దావర్ గంగారెడ్డి, పెద్దమావంది గంగారెడ్డి, రవికిరణ్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, సాయిలు ఉన్నారు.

ఎమ్మెల్యే షకీల్ సతీమణి ప్రచారం

బోధన్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే షకీల్ సతీమణి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అమ్దాపూర్, ఊట్‌పల్లి బెల్లాల్ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేగా షకీల్‌ను గెలిపించాలన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



బాల్కొండ: మెండోరా మండలం కోడిచర్ల గ్రామానికి చెందిన సొసైటీ మాజీ చైర్మన్ కృష్ణరెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి సోమవారం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గడ్డం సంతోష్ రెడ్డి, దేవేందర్, నడిపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోచుకొని దాచుకోవడమే బీఆర్ఎస్ లక్ష్యం



దత్తాపూర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న రాకేష్‌రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుని దాచుకోవడమే లక్ష్యంగా పని చేసిందని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని దత్తాపూర్, తొండాకూర్, కోమట్‌పల్లి, నికాల్‌పూర్ గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, బీజేపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తనకు రాజ్యసభ సీటు ఇప్పిస్తానని ఆశ చూపించారని, సీఎం కేసీఆర్‌ను కలిపిస్తానని చెప్పినప్పటికీ తాను లొంగలేదని అన్నారు. ఒక్కసారి బీజేపీకి ఓటు వేస్తే ప్రజల తలరాత మారుతుందని, ప్రతీ ఇంటికి రెండు పింఛన్లు ఇస్తామన్నారు. ఎంపీటీసీలు గంగాదేవీ, సంజీవ్, బీజేపీ మండల అధ్యక్షులు సురేందర్, మారంపల్లి గంగాధర్, రాము, తదితరులున్నారు.

బీజేపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి



సాలంపాడ్ క్యాంప్ గ్రామంలో మాట్లాడుతున్న మేడపాటి ప్రకాష్ రెడ్డి

బోధన్/బోధన్‌రూరల్: తెలంగాణాలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి, అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సాలూర మండలంలోని సాలంపాడ్‌క్యాంప్‌లో సోమవారం ఆయన చాయ్‌పే చర్చ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించి అధికారం ఇవ్వాలని కోరారు. అలాగే బోధన్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు. గోనే ప్రవీణ్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు



నందిపేటలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి గొర్రెపిల్లను బహూకరిస్తున్న కురుమ సంఘ నాయకులు



డీకంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి

నందిపేట్(ఆర్మూర్): సీఎం కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలకు సముచిత రీతిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆర్మూరు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని కురుమ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నియోజకవర్గస్థాయి కురుమ సోదరుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కురుమ సోదరులకు పెద్దపీట వేసిందని, బీఆర్ఎస్ వచ్చాకే బీసీలకు స్వర్ణయుగం మొదలైందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీల టక్కరి మాటలు నమ్మొద్దన్నారు. అన్ని సర్వేలు బీఆర్ఎస్‌కే అనుకూలం వస్తున్నాయన్నారు. కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గే మల్లేశంకు ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చిన కేసీఆర్ రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు ఇస్తారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను చేస్తున్న కృషిని గుర్తించాలన్నారు. నాయకులు రాజారామ్ యాదవ్, దేవన్న, కేజీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వంశి, రాజు, ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు శృంగారం ప్రవీణ్, నవీన్, రమేష్, మురళి సోమవారం ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎంపీపీ పస్క నర్సయ్య, సర్పంచ్‌లు గంజి నర్సయ్య, ఇందూర్ సాయన్న, నాయకులు పాల్గొన్నారు.

అలాగే ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్, కోమన్‌పల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణి ప్రచారం..

మాక్లూర్: ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తరపున ఆయన సతీమణి రజిత సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీకంపల్లి, మెట్టు తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి జీవన్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. బడుగు సత్యం, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

యువత చూపు బీఆర్ఎస్ వైపు..



యువకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి

వేల్పూర్/బాల్కొండ: సీఎం కేసీఆర్ జనరంజక పరిపాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి వల్ల యువత బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, పార్టీకి విశేష స్పందన లభిస్తోందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాల్కొండ, భీమ్‌గల్, మోర్తాడ్ మండలాలలోని పలు గ్రామాలకు చెందిన యువజన సంఘాల సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. వేల్పూర్‌లో సోమవారం వారికి మంత్రి గులాభి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు బాల గంగాధర్, ముప్పారం శ్రీధర్, హాఫీజ్, బద్దం ప్రవీణ్‌రెడ్డి, వాహబ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం

వేల్పూర్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి మద్దతుగా స్థానిక జక్కుల సంఘం 19 కుటుంబాలు సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సామ మహిపాల్ ఆధ్వర్యంలో తీర్మానపత్రాన్ని మంత్రి ప్రశాంత్‌రెడ్డికి అందజేశారు.

నెరవేరని హామీలతో ఫ్లెక్సీ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం సందర్భంగా నెరవేరని హామీలతో గుర్తు తెలియని వ్యక్తులు గ్రామస్తుల పేరుతో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ హామీలు ఏమయ్యాయంటూ ప్రశ్నిస్తూ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	లింగోచ్చా(తెలుగు) - 1.45, ఒక్కడే-1 (తెలుగు) - 4.45, మార్టిన్ లూథర్ కింగ్(తెలుగు) - 7.25, ఓటు (తెలుగు) - 10.30
స్క్రీన్-2 -	భగవంత్ కేసరి (తెలుగు) - 11.15, 2.40, 6.05, 9.30
స్క్రీన్-3 -	లియో (తెలుగు) - 11.55, 3.20, 6.45, 10.10
స్క్రీన్-4 -	మార్టిన్ లూథర్ కింగ్ (తెలుగు)-12.05, నాగేశ్వరరావు-3.10, 6.35, 10.00

సంక్షిప్తం

అభినందన సభ



భీమ్‌గల్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ బద్దం మధుశేఖర్‌కి సోమవారం పట్టణంలో దళిత ఐక్య సంఘటన అధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రిక్క లింబాద్రి, రాష్ట్ర మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ పాల్గొని, మాట్లాడారు. స్వరాష్ట్రంలోనే దళితులకు ఉన్నత పదవులు వచ్చాయని అన్నారు. అనంతరం వారు మధుశేఖర్‌ను సన్మానించారు. టీఎస్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, మానస గణేష్, అశోక్, నాగరాజు, రెంజర్ల రాజేష్, ప్రసాద్, నవీన్, శ్రీనివాస్, ముతేన్న, శంకర్, సురేందర్, ఏలీయా పాల్గొన్నారు .

నియామకం

ఎడపల్లి: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఏఆర్‌పీ క్యాంప్ గ్రామానికి చెందిన మహేష్ గౌడ్ నియమితులయ్యారు. ఈసందర్భంగా సోమవారం ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్య నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన వేంపల్లి యువకులు

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన నరేష్, ద్యాగ మనోజ్, క్రిష్‌లు 'మేరీ మాటి– మేరా దేశ్' ముగింపు కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా వారు కార్యక్రమంలో పాల్గొనడానికి సోమవారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

కాంగ్రెస్ పార్టీ ప్రచారం..

బోధన్: పట్టణంలోని 14వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించారు. పాషా మోయినొద్దిన్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వాహనాల తనిఖీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలో వాహన తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. సోమవారం ఎస్సై రాహుల్, సిబ్బంది మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు వెళ్తున్న కార్లు, బైకులను ఆపి తనిఖీ చేశారు.

ఎడపల్లి: మండలంలోని అంబం గేట్ వద్ద ఎడపల్లి ఎస్సై విక్రమ్, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది సోమవారం వాహనాల తనిఖీలు నిర్వహిచారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తనిఖీల చేపట్టినట్లు ఎస్సై విక్రం తెలిపారు.

ముగిసిన జింక నందు అంత్యక్రియలు

మాక్లూర్: ఢిల్లీలో ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన బీటెక్ విద్యార్థి జింక నందు (24) అంత్యక్రియలు స్వగ్రామం మండలంలోని గుంజిలి గ్రామంలో సోమవారం ముగిశాయి. అలాగే బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి పైడి రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరు వినయ్‌రెడ్డి పరామర్శించారు.